ప్రజాశక్తి
గురువారం 4 జనవరి 2024
I
అల్లూరి సీతారామరాజు



మన్యం కాఫీకి అవార్డు

ప్రజాశక్తి-పాడేరు: అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన పాడేరు కాఫీకి మరో అవార్డు దక్కింది.అరకు కాఫీకి ఒక జిల్లా ఒక పంట అవార్డు దక్కింది. 2023 అక్టోబరు నెలలో కేంద్ర బృందం ఏజెన్సీలో పర్యటించి గిరిజన ప్రాంతంలో సేంద్రీయ విధానాలు సాగు చేస్తున్న కాఫీ పంటను పరిశీలించింది. ఒక జిల్లా ఒక పంట 2023 అవార్డుకు ఎంపికైంది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా జిసిసి వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ జి.సురేష్ కుమార్ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలోని భారత్ మండపం ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు కాఫీ పంటకు ఒక జిల్లా ఒక పంట అవార్డు దక్కింది.



అంగన్‌వాడీల పోరాటం ఉధృతం

కలెక్టరేట్, సబ్ కలెక్టర్ కార్యాలయాల వద్ద బైఠాయింపు



పాడేరులో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు, నాయకులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం ఉధృతం చేశారు. పాడేరు కలెక్టరేట్, రంపచోడవరంలో సబ్ కలెక్టరేట్ కార్యాలయాల వద్ద బైఠాయించారు. ముందుగా భారీ ర్యాలీలు చేపట్టారు.

పాడేరు: ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి మొండి వైఖరి విడనాడాలని, అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి జిల్లా కలెక్టర్ వద్ద బైఠాయించారు. అంతకుముందు పాత బస్టాండ్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ, ప్రదర్శనగా కలెక్టరేట్‌కు కదిలి వచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సుమారు రెండు గంటలసేపు బైఠాయించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి నాయకురాలు పెంటమ్మ అధ్యక్షత వహించగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు డి.నాగమ్మ, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు, బోనంంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుందని విమర్శించారు. సమ్మె 23 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అంగన్వాడీలు ఎక్కువమంది బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని, ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పని భారం పెరిగిందని, రోజుకు 18 గంటలు పనిచేస్తున్నా కనీస వేతనం చెల్లించలేదని దుయ్యబట్టారు. వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన ఆహార సరుకులు ఇవ్వమని చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణం డిమాండ్లు పరిష్కరించకపోతే జగన్ ప్యాలెస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్వాడి పోరాటానికి మద్దతు తెలుపుతూ సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో బిజెపి చవతి తల్లి ప్రేమ చూపిస్తుందని అన్నారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని బిజెపి కుట్ర చేస్తుందని, దీంట్లో భాగంగానే బడ్జెట్లో కేటాయింపులు తగ్గిస్తున్నారన్నారు.ఇటీవల కాలంలో చింతపల్లిలో ముఖ్యమంత్రి పర్యటనలో గిరిజనుల కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదని అన్నారు బోయ వాల్మీకుల్ని ఎస్టీ జాబితాలో చేసేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసిందని, ఇది జరిగితే స్థానిక గిరిజనులకి తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక నాయకులను చర్చిలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అనంతగిరి జడ్పిటిసి డి.గంగరాజు మద్దతు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ మద్దతు తెలిపారు. అనంతరం అంగన్వాడి యూనియన్ ప్రతినిధులు, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్వాడి ప్రాజెక్ట్ నాయకులు పి. వెంకటలక్ష్మి, రాజమ్మ, కొండమ్మ, మంజుల, నరసమ్మ సిఐటియు జిల్లా నాయకులు సన్నిబాబు, శంకర్రావు, సత్యనారాయణ, పడాల్, మోసియా తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

రంపచోడవరం : కలెక్టర్లు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల చేపట్టిన ఆందోళనలో భాగంగా బుధవారం రంపచోడవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని 23 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా సమ్మె విరమించాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఇదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తే రానున్న కాలంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లిరెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకులు వి నిర్మల, రాణి రామలక్ష్మి, వెంకటలక్ష్మి, సింగారమ్మ, 7 మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.




రంపచోడవరంలో...



చింతూరులో వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

చింతూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద..

చింతూరు : 23 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎటపాక, కూనవరం, విఆర్.పురం చింతూరు నాలుగు మండలాలకు చెందిన సుమారు 300 మంది అంగన్వాడీ కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లి నినాదాలు చేస్తూ న్యాయమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ బెదిరింపులకు లొంగేది లేదని తాడోపేడో తేల్చుకుంటామని, రాబోయే ఎన్నికల్లో తమ సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపిస్తామని శపథం చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు పూనెం సత్యనారాయణ, కొమరం పెంటయ్య, వ్యకాస నాయకులు ఎర్రం శెట్టి శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, అంగన్వాడీలు జయ, చిట్టెమ్మ, కిట్టమ్మ, నూకరత్నం, వెంకటరమణ, సత్యవతి, కనకదుర్గ ు పాల్గొన్నారు.



చెక్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వైఎస్ఆర్ పెన్షన్ కానుక విడుదల

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో 1 లక్ష 28,821 లబ్దిదారులకు రూ.30.3 కోట్ల వై యస్ ఆర్ పెన్షన్ కానుక విడుదలయ్యిందని అరకు పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. బుధవారం కాకినాడ నుండి రాష్ట్ర ముఖ్య మంత్రి వై యస్.జగన్మోహన్ రెడ్డి వై.యస్.ఆర్ పెన్షన్ కానుక ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ వైయస్ఆర్ పెన్షన్ కానుకను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సామాజిక పంఛన్ల లబ్దిదారులకు క్రమం తప్పకుండా పింఛన్లు అందించడం జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జనవరి నెల నుండి సామాజిక పింఛన్లను మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. అరకు వ్యాలీ నియోజక వర్గంలో 30,602 మంది లబ్దిదారులకు 12 కోట్ల 16 లక్షల ఐదువేలు, పాడేరు నియోజక వర్గంలో 38,970 మందికి 11 కోట్ల 91 లక్షల 2500లు, రంపచోడవరం నియోజక వర్గంలో 50,249 మందికి రూ.14 కోట్ల, 96లక్షల70 వేల పింఛన్లు విడుదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఏ పిడి వి.మురళి, ఎంపిటిసి గిడ్డి జయలక్ష్మి, చింతలవీధి సర్పంచ్ సీతమ్మ, వెలుగు ఏపియం వి. ఎస్.ప్రసాద్, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తాళాలు బద్దలు కొట్టి
బాలింతలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తాడేపుట్టు పంచాయితీ గడుగుపల్లి గ్రామంలో సూపర్వైజర్, సచివాలయంలో సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి బలవంతంగా బాలింతలకు పాల ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. అంగన్వాడీలు చేస్తున్న ఉద్యమాలను నీరు గార్చేందుకు గత వారం పది రోజుల నుంచి అంగన్వాడి సెంటర్ల తాళాలు తెరిపించి బాలింతలకు సరుకులు పంపిణీ చేస్తున్నారు.



స్టాక్ ఇస్తున్న సచివాలయ సిబ్బంది

ఆదివాసీ గిరిజన సంఘం నేతల అరెస్టు

ప్రజాశక్తి-హుకుంపేట: అంగన్వాడీల చలో కలెక్టరేట్ నేపథ్యంలో మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి కృష్ణారావు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావులను బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా ఇంటిలోనే హౌస్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో భయపడే ప్రశక్తే లేదని కృష్ణారావు, కొండలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



స్టేషన్‌లో గిరిజన సంఘం నేత



ఎండియు ఆపరేటర్‌ను నిలదీస్తున్న వడ్డిగూడెం గ్రామస్తులు

3 నెలలుగా రేషన్ సరుకులు ఇవ్వకపోవడంపై నిలదీత

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో మూడు నెలలుగా రేషన్ సరుకులు ఇవ్వకపోవడంపై మొబైల్ డిస్టిబ్యూషన్ యూనిట్ (ఎండియు) ఆపరేటర్‌ను, అధికారులను మంగళవారం స్థానికులు నిలదీశారు. ఎన్నెసి నెలలు సరుకులు ఇవ్వకుండా తమ కుటుంబాలను ఆకలితో ఉంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి జనసేన పార్టీ నాయకులు మద్దతుగా నిలిశారు. తక్షణమే బియ్యం, ఇతర సరుకులు ఇవ్వాలని, లేకుంటే తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమం నాయకులు బాగుల అంజనారావు, సాయి దుర్గాప్రసాద్, జనసేన కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి పంచాయితీ పరిధిలో జాతీయ రహదారి నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వాలని పాడేరులో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు బుధవారం సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, మండల కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేశ్వరరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. అరకు ఎంపీ గొట్టేటి మాధవిని కలిసి పలు సమస్యలు వివరించారు. జడ్డంగి, చిన్నయ్య పాలెం మీదుగా సింగంపల్లి రహదారి అత్యవసరమని, సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సర్పంచ్ మురళీకృష్ణ తదితరులు వివరించారు.



కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కలుషిత ఆహారం తిని
39 మంది ఆశ్రమ విద్యార్థినులకు అస్వస్థత

చింతూరు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు



విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఐటిడిఎ పిఒ చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం, బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం కలుషిత ఆహారం వల్ల 39 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరంతా ప్రస్తుతం చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి....

బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు మంగళవారం మధ్యాహ్నం భోజనం చేశారు. తరువాత సాయంత్రం సమయంలో 12 మంది విద్యార్థులు తీవ్రంగా వాంతులు, కడుపునొప్పితో బాధపడుతుండటంతో వారిని ఏడుగురాళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యురాలు విశ్వచైతన్య, సిబ్బంది వారికి వెంటనే వైద్యం అందించారు. తరువాత వైద్యురాలు ఆశ్రమ పాఠశాలను సందర్శించగా, అక్కడ సిక్ రూంలో మరో 12 విద్యార్థినులు తీవ్ర అస్వస్థతతో ఉండడాన్ని గమనించి వారిని కూడా ఆసుపత్రికి తరలించారు. వారిలో చాలా మంది జ్వరంతో పాటు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఇది ఇలా ఉండగా, రాత్రి భోజనం తరువాత మరో 15 మంది బాలికలు తలనొప్పి వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు వీరిని వెంటనే చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య శాఖ చర్యలు చేపట్టింది. జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పులయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు ఏడుగురాళ్ళపల్లి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న 24 మందిని బుధవారం ఉదయం చింతూరు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీరందరూ ప్రస్తుతం చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మధ్యాహ్నం పప్పు, బంగాళదుంపల కూరలతో భోజనం పెట్టారు. సాయంత్రం సమయంలో మజ్జిగ ఇచ్చారు. అది తాగిన కొద్ది సమయానికే విద్యార్థినులకు వాంతులు మొదలై తీవ్ర అస్వస్థకు గురైనట్లు తెలుస్తోంది. ఆహారం కలుషితం కావడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు చెప్పారు.

ఉడకని భోజనం పెడుతున్నారు

బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న మీడియా వారు రాత్రి హాస్టల్ సందర్శించి భోజనాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమకు పెట్టే భోజనం సారిగా ఉండడం లేదన్నారు. ఎప్పుడైనా ఎవరైనా అధికారులు వచ్చినప్పుడు మాత్రమే మంచిగా వండి పెడుతున్నారని, మిగతా రోజుల్లో ఉడికీ ఉడకని భోజనం పెడుతున్నారని వాపోయారు. దోమలు ఎక్కువగా ఉంటున్నాయని, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదని, భోజనశాల అపరిశుభ్రంగా ఉందని చెప్పారు. మరో వైపు తీవ్ర అస్వస్థతతో ఉన్న కొంత మంది విద్యార్థినులను హాస్పటల్‌కి తరలించకుండా పాఠశాల సిబ్బంది తీవ్ర నిర్లక్షంతో సిక్ రూమ్‌లో ఉంచడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐటిడిఎ పిఒ సందర్శన

సమాచారం అందుకున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య బుధవారం ఆశ్రమ హాస్టల్‌ను, విద్యార్థినులు చికిత్స పొందుతున్న ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీశారు. అస్వస్థకు గురైన బాలికలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అధికారులు, హాస్టల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాలికల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలు, ఎలా రక్షించుకోవాలి అనే విషయాలపై స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఫైర్ స్టేషన్ సిబ్బంది బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో గాయపడిన వారిని ఏ విధంగా రక్షించాలి? పిఎఫ్ఆర్ అనగా ఏమిటి, దానిని ఏవిధంగా చేయాలి, భూకంపాలు, ఫైర్ ఎక్విప్మెంట్ గురించి, గ్యాస్ ప్రమాదాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బి రామచంద్రరావు, జె.నాగేశ్వరరావు, శ్రీరాములు రెడ్డి, వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



నాగసురేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరుగు పందెంలో గురుకుల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మన్యం పార్వతీపురం జిల్లా కొనవలస ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాలలో 2023 డిసెంబర్ 28 నుండి 30వ తేదీ వరకు మూడు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల్లో మారేడుమిల్లి గిరిజన గురుకుల కళాశాల విద్యార్థి డి.నాగ సురేష్ ప్రతిభ కనబర్చారు. 400, 800, 1500 మీటర్లు మూడు విభాగాల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు స్పోర్ట్స్ విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్, ఓవరాల్ ఛాంపియన్ సాధించారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం డి.నాగ సురేష్‌ను తర్ఫీదు ఇచ్చిన పిడి దేవిడ్ జాన్‌ను కళాశాల ప్రిన్సిపల్ జి సత్యనారాయణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఎస్ఎంఎఫ్ నిధులు వేరే పాఠశాలకు మళ్లించడం సరికాదు

ప్రజాశక్తి -కూనవరం

తమ పాఠశాలకు చెందిన ఎస్ఎంఎఫ్ నిధులను వేరే జిల్లాల పాఠశాలలకు మళ్లించడం సరికాదని మండలంలోని కూటూరు విద్య కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యా కమిటీ చైర్మన్ పాయం సమ్మయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ స్కూల్‌కు వచ్చిన నిధులను వేరే జిల్లాల స్కూళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. తమ స్కూల్‌లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. గతంలో తాగునీటి మోటార్ పాడైతే తామే స్వయంగా బాగు చేయించుకున్నామని చెప్పారు. వర్షం వస్తే బిల్డింగ్ కారిపోతుందని, ఫ్యాన్లు లేవని, పిల్లలు కూర్చోవడానికి కనీసం బల్లలు కూడా లేవని, తలుపులు కిటికీలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఖర్చు చేయాల్సిన నిధులను ఏ విధంగా వేరే జిల్లాకు ప్రభుత్వం పంపుతుందని ప్రశ్నించారు. తమ పాఠశాలకు వచ్చిన నిధులు తమ స్కూల్‌కే ఖర్చు చేయాలని తీర్మానం చేసి అధికార్లకు పంపడం జరిగిందని తెలిపారు. బలవంతం చేస్తే విద్య శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముత్తమ్మ, రాధ, రమణ, కామేశ్వరి, జయమ్మ, ఉప సర్పంచ్ పాయం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు

భగ్గుమన్న వైసిపి నేతలు

-ఎంపీ మాధవికి టిక్కెట్ కేటాయింపుపై ఆగ్రహం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకు నియోజక వర్గంలో స్థానికులకే అసెంబ్లీ సీటు కేటాయించాలని స్థానికులు తెలిపారు.వైసీపీ అరకు నియోజకవర్గం టికెటిను ఎంపీ గొడ్డేటి మాధవికి కేటాయిస్తున్నట్లు సమాచారం రావడంతో నియోజకవర్గం, పార్లమెంట్ పలువురు ఆశావహులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అరకు నియోజకవర్గంకు చెందిన వివిధ మండలాలకు చెందిన వైసీపీ నాయకులు మంగళవారం గిరిజన ఉద్యోగుల భవనంలో సమావేశం అయ్యారు.అరకు నియోజకవర్గంలో స్థానికులకు ఎవరికి టికెట్ కేటాయించిన కట్టుబడి ఐక్యమత్యంతో పని చేస్తామని నాన్ లోకల్ అభ్యర్థులను టికెట్ కేటాయిస్తే ఓడిపోతారని చెప్పారు. ఈ సందర్భంగా అనంతగిరి మాజీ ఎంపీపీ వైసీపీ సీనియర్ నాయకుడు శెట్టి గంగారరస్వామి, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, పెదలబుడు మాజీ సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకుడు సమర్ది రఘునాథ్ మాట్లాడుతూ, వేరే నియోజకవర్గానికి చెందిన ఎంపీ మాదవికి అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే వైసీపీ పార్టీ ఓటమి తప్పదన్నారు. అందుకే గెలిసే అభ్యర్థులను బరిలో నిలపాలని అభిప్రాయాన్ని అధిష్టానానికి తెలియజేస్తున్నట్లు చెప్పారు. అధిష్టానం పునరాలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ మండలాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో సమన్వయకర్తగా ఎంపీ గొడ్డేటి మాధవిని పార్టీ అధిష్టానం నిర్ణయించడం పట్ల మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. అధిష్టాన నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. స్థానికేతరులు వద్దు !స్థానికమే ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ మాట్లాడుతూ,నియోజకవర్గ పరిధిలోని నాయకులకు సమన్వయకర్తగా నియమించకుండా వేరే నియోజకవర్గం నుంచి ఎంపీ మాధవిని నియమించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, ఎంపిటిసి మహాదేవ్, సర్పంచ్‌లు వి.వెంకట్రావు, జి నాగేశ్వరరావు, నాయకులు కృష్ణారావు, సింహాచలం, శ్రీరాములు, గోపాల్, మల్లేష్ పాల్గొన్నారు.

హుకుంపేట:స్థానికులకే టికెట్ కేటాయించాలని స్థానిక వైసిపి నాయకులు, అభిమానులు సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తే అరకు నియోజకవర్గంలో వైసిపి ఓడిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు సీదరి సాంబ, పూజారి మేరీ, పి.బాలన్న, కాకరి బొంజు బాబు, ధనసాని సత్యవతి, వి.ఈశ్వరమ్మ, శ్యాంసుందర్రావు, ఎంపీటీసీలు భీమేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో వైసిపి నేతలు ఆందోళన చేపట్టారు. పార్టీ అధిష్టానం ఆలోచన మార్చుకోవాలని నినాదాలు చేసారు.

అరకులోయ: అరకు ఎంపీ మాధవిని అరకు ఇన్చార్జిగా నియమించడంతో ఒక్కసారిగా బగ్గుమంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎమ్మెల్యే టికెట్ ఆశాహావులు, కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్లో మానవహారం నిర్వహించి వైయస్సార్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంపీ మాధవి గో బ్యాక్ స్థానికులే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు జడ్పిటిసి రేగం మత్స్యలింగం, వైసీపీ సీనియర్ నేత మాజీ మాజీ సర్పంచ్ సమర్ధి రఘునాథ్ తదితరులు మాట్లాడుతూ, ఎంపీ మాధవికి అరకు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే తాము పార్టీ గెలుపు కోసం పనిచేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఏ బలం ఉందని మాధవికి ఇక్కడ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారని ప్రశ్నించారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే అరకు నియోజకవర్గంలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని వారు స్పష్టం చేశారు. అధిష్టానం ఈ విషయంపై పునరాలోచించకపోతే అరకు అసెంబ్లీ గల్లంతేనని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు సమడ్డి రఘునాథ్, సమర్ధి భాస్కరరావు, కొర్ర కాసులమ్మ సర్పంచ్ రమేష్, సంపత్ పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ ధర్నా



యుటిఎఫ్ నాయకుల ధర్నాకు మద్దతుగా కూర్చున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు:ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యుటియఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్ర మైన పాడేరులో బుధవారం ఐటిడిఏ కార్యాలయం ముందు 12గంటల ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుండి ఉపాధ్యాయులు తరలి వచ్చారు.ముందుగా భారతదేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి యూటియఫ్ సీనియర్ జిల్లా నాయకులు పండా.కిష్టయ్య పూలమాలవేసి నివాళులు అర్పించారు. యుటఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, డీఏ అరియర్స్ ఇవ్వాలని, ఏపీజిఎల్ఐ లోన్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్య లు పరిష్కరించకపోతే భవిష్యత్లో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నా శిబిరాన్ని సందర్శించిన అనంతగిరి జడ్పిటిసి సభ్యులు గంగరాజు మాట్లాడుతూ,ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి తక్షణమే వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాల కార్యదర్శులు సి. హెచ్.నాగేశ్వరరావు, ధర్మారావు, ఎస్.నాగేశ్వరరావు, చిట్టిబాబు, దేముడు, తేజోరావు, పి.కిష్టయ్య, విశ్వరాజ్, రాష్ట్ర కౌన్సిలర్స్ ఉదయ్ మనోహర్, బి.వెంకటలక్ష్మి, 22మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు పాల్గొన్నారు.

ఆదివాసీ మాతృ బహుభాష విద్యా బోధకులకు

టైం స్కేల్ అమలుచేయాలి

ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు:- ఆదివాసి మాతృ బహు భాష విద్యా బోధనకులకుటైం స్కేలు ఇవ్వాలని, ఫిబ్రవరిలో రెన్యువల్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ సంఘం జిల్లా ప్రథమ మహాసభ బుధవారం పాడేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా టైం స్కేల్ అమలు చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచకుండా వీరితో వెట్టిచాకిరి చేయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో స్థానిక యువతి యువకులను రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1327 మందిని 2023 - 24 విద్యా సంవత్సరంకుగాను పాఠశాల విద్య కమిటీ ద్వారా నియమించి, గౌరవ వేతనం కేవలం 5వేలు మాత్రమే చెల్లిస్తూ వెట్టి చాకిరీ చేస్తుందన్నారు.టైం స్కేల్ అమలు చేసి 32 వేలు ఇవ్వాలని కోరారు. వీరు కూడా బిఈడి, డైట్ ట్రైనర్స్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యావంతులు కావడంతో ప్రాథమిక విద్యలో నాణ్యత, నైపుణ్యత పెరిగిందన్నారు. విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గిందన్నారు.మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యా అందుబాటులోకి వచ్చిందన్నారు. చదువుతో ఆదివాసీ ప్రజల్లో జీవన ప్రమాణాలు పెరగడంతోపాటు భాహ్య ప్రపంచంతో అనుసంధానం పెరిగిందని తెలిపారు. జి.ఓ 3ను రద్దు కావడంతో స్థానిక ఆదివాసీలు ఉద్యోగ, ఉపాధి కోల్పోతున్నారన్నారు. 100 శాతం రిజర్వేషన్ కల్పనకు చట్టబద్దత కల్పిస్తామని, సుప్రీంకోర్టులో రివ్యు పిటిషన్ దాఖలు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. సర్భ నాయుడు కార్యకలాపాల నివేదిక ప్రవేశ పెట్టారు. సతీశ్, చిట్టి బాబు, చంద్రయ్య, వీరయ్య, కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనర్స

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఆదివాసీ మాతృ బహుభాష విద్యా బోధకుల సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఎస్.చిట్టి బాబు,జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాంగి శ్రీను, కోశాధికారులుగా ఎస్.సతీశ్, వి.చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా నాయుడు, కే.చిరంజీవి, ఎం. రాంబాబు, చిన్నారావు, ఎస్.కొండలరావు, పి.నాగేశ్వరరావు, టి. సత్యనారాయణ,కే. వీరయ్య, చిట్టిబాబు, జగన్. సహాయ కార్యదర్శులుగా పి.కొండబాబు,.ఎమ్. బాలరాజు,.ఎస్. దేవుడు తదితరులు నియమితులయ్యారు.

పశువులు, మేకలకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి -అనంతగిరి

ముందస్తు జాగ్రత్తగా పశువులు, మేకలకు గాలికుంట టీకాలను స్థానిక పశువైద్య అధికారి సందీప్ ఆధ్వర్యన గువశోభ పంచాయతీ జామగుడ సమీప గ్రామాల్లో టీకాలు వేశారు.చిన్నపాటి వ్యాధి సోకిన వెంటనే పశువైద్య శాఖ సిబ్బందికు సమాచారం అందించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు కీలకం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:రానున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఎన్నికల నిర్వహణపై ఐటిడిఏ సమావేశ మందిరంలో పాడేరు నియోజక వర్గం జోనల్ అధికారులకు బుధవారం ఒక రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు నిర్వహించ వలసిన బాధ్యతలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. జోనల్ అధికారులు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు కలిగి ఉంటారని చెప్పారు. పోలింగ్ సమర్ధవంతంగా నిర్వహించే బాధ్యత, ఎన్నికల సామగ్రి, భద్రతా సిబ్బందితో సమన్వయం మోడల్ ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని చెప్పారు. ఈవిఎంలు సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించి, తిరిగి సకాలంలో వచ్చే విధంగా చూసుకోవాలని సూచించారు. మార్గ మధ్యలో ఎక్కడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వాహనాలను నిలుపుదల చేయకూడదని చెప్పారు. మాక్ పోలింగ్‌పై అవగాహన ఉండాలని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారుల డైరీ సక్రమంగా నిర్వహించి ప్రతీ రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డి.ఆర్.ఓ వి.వి.రమణ, ఎస్.డి.సి,పి. అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ఎం రాజు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా కృష్ణ, పాడేరు నియోజక వర్గాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైటాయించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల బైఠాయింపు

ప్రజాశక్తి-పాడేరు:సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా 15వ రోజు బుధవారం పాడేరులో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించారు. సమ్మె దీక్ష శిబిరం నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి బైఠాయించారు. సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.పాడేరు సబ్ కలెక్టరు ధాత్రి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన సోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆరు నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు బి.కాంతారావు, బి ఎస్‌పి జిల్లా నాయకులు అప్పారావు, జిల్లా జనరల్ సెక్రెటరీ వి.జయరాజు, అధ్యక్షులు అనిల్, ట్రెజరర్ పి.సింహాచలం పాల్గొన్నారు..

12 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: నాటు సారా అమ్ముతున్నారనే సమాచారం మేరకు స్థానిక ఎస్సై రవీంద్ర బుధవారం మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.


భాగ్యలక్ష్మిని కలిసిన మండల నాయకులు



భాగ్యలక్ష్మిని కలిసిన అభినందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు : వైసిపి అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మిని ఎంపిపి బడుగు రమేష్, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, వైస్ ఎంపిపి అప్పన వెంకట రమణ, ఎఎంసి చైర్‌పర్సన్ రాజులమ్మ, ఇతర నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గాడి సత్యనారయణ, బండి సుధాకర్, ధోని బాబ్జీ,రీమల గంగాదర్,ప్రసాద్,రామరాజు, సర్పంచులు ముసిలి నాయుడు, సొమన్న, దొర, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తమ్మినేనికి ఘన సన్మానం



తమ్మినేనిని గజమాలతో సత్కరిసుత్న్న పప్పల రామ్మోహనరావు

ప్రజాశక్తి- మాధవధార : ఎపి శానసనభాధిపతి తమ్మినేని సీతారామ్‌ను అఖిలభారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పప్పల రామమోహనరావు ఆధ్వర్యంలో బుధవారం మాధవధార, మాధవస్వామి కల్యాణ మండపంలో ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన తమ్మినేని సీతారాం, విద్యార్థి నాయకుని స్థాయి నుంచి కార్మిక నేతగా, రాష్ట్రస్థాయి క్రీడాకారుడిగా, ఉద్దండ రాజకీయనేతగా ఎదిగి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. సంక్షోభ సమయాలలో, ప్రజా ఉద్యమాలలో తమ్మినేని పాత్ర నేటితరానికి ఆదర్శనీయమన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ, ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు అనుగుణంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి తమ్మినేని విశేష సేవ చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు సమక్షంలో తమ్మినేని సీతారామ్‌ను గజమాల, కిరీటంతో పప్పల రామ్మోహనరావు సత్కరించి, ప్రశంసాపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, మహిళా నాయకురాలు పేడాడ రమణకుమారి, బిసి కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాది కెవి.స్వామి హఠాన్మరణం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది కెవి.స్వామి 72వ వార్డు చైతన్యనగర్‌లోని తన నివాసంలో బుధవారం తెల్లవారుజామున హఠాన్మరణం పొందారు. స్థానిక ఆర్‌కె హాస్పిటల్‌లో ఉంచిన ఆయన పార్థివదేహాన్నిజివిఎంసిలో సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్, సౌత్ ఎసిపి త్రినాధ్, సీనియర్ న్యాయవాదులు కోదండరామయ్య, వెన్నెల ఈశ్వరరావు, ప్రభాకరరావు, చిరంజీవి, గాజువాక బార్ అసోసియేషన్ కార్యదర్శి బివిఎం కృష్ణ, సిపిఐ నేత జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, గాజువాక కోర్టు న్యాయమూర్తులు, తదితరులు కెవి. పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సావిత్రిబాయి పూలేకు ఘననివాళి

ప్రజాశక్తి-చింతూరు: సావిత్రి బాయి పూలే 193వ జయంతి కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మణిక్యం, సిబ్బంది తొలుత సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రి బాయి పూలే మహిళా విద్య అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. తన భర్త జ్యోతిరావుపూలే సహకారంతో, ఆయన గురువుగా ఉండి విద్య నేర్పించి స్త్రీ విద్య కోసం పాటుపడ్డారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగదిపతి జి. వెంకట్రావు, చరిత్ర విభాగాధిపతి పి.ఏడుకొండలు, అధ్యాపకులు ఎస్.అప్పనమ్మ, జి. హారతి, సిహెచ్. రాజబాబు, ఆర్.మౌనిక, జి. సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్సియల్ స్కూల్‌లో సంఘం సస్కర్త సావిత్రిబాయ్ పూలే జయంతి ఘనంగా నిర్వహించారు.మండల విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి, డేవిడ్ పుష్పలు ఆమె సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డిఎస్ శంకర్ రావు పాల్గొన్నారు



చింతూరులో పూలేకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు , విద్యార్థులు

నేటి నుంచి కథా నాటిక పోటీలు

అజో విభో కందాళం, రైటర్స్ అకాడమీ ఆధ్వర్యాన నాలుగు రోజుల పాటు నిర్వహణ

ప్రజాశక్తి-సీతమ్మధార : అజో విభో కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో మద్దిలపాలెం కథా నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ వివి.రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాభారతిలో విశిష్ట పురస్కారాలు, సాహితీ సాంస్కృతిక సదస్సులు ఉంటాయన్నారు. బుధవారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10.30 వరకు రోజుకు మూడు నాటికలను ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ముందుగా ఎంట్రీపాస్‌లను పొంది, ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగానే ప్రదర్శనలను తిలకించవచ్చని సూచించారు. ప్రదర్శనల మధ్యలో ప్రేక్షకులకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.. నాలుగు రోజులు పాటు నాటక ప్రదర్శనలను తిలకించి ప్రోత్సహించాలని రమణమూర్తి కోరారు. అజో విభో కందాళం సంస్థ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ 1994లో తమ సంస్థ ఆవిర్భవించిన నాటి నుంచి 31ఏళ్లుగా ఏటా వార్షికోత్సవాలను నిర్వహిస్తూ ఇలా నాటక పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో విశాఖలో ఇది రెండో వార్షికోత్సవమన్నారు. నాటిక పోటీలకు 29 ఎంట్రీలు రాగా వాటిని స్క్రూటినీ చేసి, తొమ్మిదింటిని ప్రదర్శనకు ఎంపిక చేశామన్నారు.

ఈ సందర్భంగా మల్లిపురం జగదీష్‌కు 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారం, రేవూరి అనంత పద్మరావుకు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం, ఎల్లపు ముకుంద రామారావులకు ప్రతిభా మూర్తి పురస్కారాల కింద నగదు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. అలాగే ముగ్గురు కళాకారులకు రంగస్థల సేవామూర్తి జీవితకాల సాధన పురస్కారాలను అందిస్తామన్నారు. దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రదర్శనల వేదికకు 'శ్రీరావూజీ రంగస్థలం కళావేదిక'గా పేరు పెట్టామన్నారు.

డాక్టర్ కందాళం వెంకట రామాను చార్యులు మాట్లాడుతూ నాటక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో ప్రేక్షకులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కువైట్ స్వామి, మీసాల నాయుడు, మేడా మస్తాన్‌రెడ్డి, వర్రే నాంచారయ్య, కేఎం నాయుడు, కోరుకొండ రంగారావు, కన్నబాబు, రాంబాబు, నవరస మూర్తి, ఫణిస్వామి, వేణు మాస్టర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉన్నత చదువులకు వెళ్ళాలా, ఉద్యోగం చేసి కుటుంబానికి చేదోడుగా నిలవాలా అనే సందిగ్ధంలో ఎటూ తేల్చుకోలేక మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన . ఆరిలోవ సుందరయ్య కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తల్లిండ్రులతో కలిసి సుందరయ్యకాలనీలో నివాసముంటున్న తమ్మినేని ప్రవీణ్ కుమార్(19) ఇటీవల పాలిటెక్నిక్ పూర్తి చేసాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఉద్యోగం చేయాలనుకుంటే, తల్లిదండ్రుల మాత్రం ఉన్నత చదువు చదవాలని చెప్పడంతో ప్రవీణ్ ఎటూ తేల్చుకోలేక సతమతమయ్యాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్ళి బుధవారం ఉదయం తిరిగొచ్చిన కొడుకును ఎక్కడికి వెళ్ళావని తల్లి నిలదీసి మందలించడంతో మనస్తాపానికి గురయ్యారు. బుధవారం ఉదయం ప్రవీణ్ తల్లి కృష్ణవేణి ఆరిలోవలో తాను పనిచేస్తున్న స్కూలుకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తల్లి, ఫ్యాన్‌కు వేలాడుతూ కొన ఊపిరితో ఉన్న కొడుకును స్థానిక సాయంతో విమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు.మృతుడు తండ్రి ఆదినారాయణ కూలి. తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు.

సిజిఎం వర్క్స్ అజయ్‌కుమార్‌కు అభినందన



సిజిఎంను అభినందిస్తున్న ఇంటక్ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ నూతన సిజిఎం (వర్క్స్) అజయ్ కుమార్ సొబతిని, అలాగే నూతనంగా నియమితులైన జిఎం వర్క్స్ పిఎస్‌రావులను ఈడి వర్క్స్ కార్యాలయంలో స్టీల్ ఐఎన్‌టియుసి అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల భద్రత, ఉత్పత్తి ఉత్పాదకతలపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం సిజిఎం వర్క్స్ అజయ్ కుమార్ సోబతి మాట్లాడుతూ కర్మాగారంలో ప్రస్తుత పరిస్థితులను వివరిస్తూ, భవిష్యత్తులో లాభాల బాట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కారు రమణ, ఎస్ఎ.నాయుడు, బిఎస్ రాజు, మింది దేవుడు, పివీ రమణమూర్తి, బిఎంకె.నాయక్, డి మోహన్, గోపాయిశెట్టి వెంకటరావు, ఆర్.కోటేశ్వరరావు, సుదర్శన్, జెర్రిపోతుల మోహన్‌కుమార్, ఎస్ నరసింహారావు, కొమ్ము ప్రసాద్, ఎస్‌వి. రమణ, వీఎం.నాయుడు, హరినాథ్, దుర్గ ప్రసాద్, ఎల్లాజీ పాల్గొన్నారు.

6న సామాజిక సాధికార బస్‌యాత్ర

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో ఈనెల 6న శుక్రవారం నిర్వహించనున్న వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు కోరారు. బుధవారం అక్కయ్యపాలెం షాదిఖానా కల్యాణమండపంలో సన్నహక సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. సాధికారయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయిపూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, ఈశ్వరరావు, కంటిపాము కామేశ్వరి, సేనాపతి అప్పారావు, కార్పొరేటర్లు కె అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి-శ్రీనివాస్, ఉషశ్రీ వావిలాపల్లి ప్రసాద్, రేయ్యి వెంకటరమణ, బర్కత్ ఆలీ, కెవిఎన్ శశికళ, వైసిపి వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, పైడి రమణ, నీలి రవి, రత్నాకర్, మండల అధ్యక్షులు జివి.రమణి, కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీశ్, కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

నేటి నుంచి 'సాయి గణపతి'లో పాలిఫెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజీలో సాయిగణపతి పాలిఫెస్ట్- 2కె24ను ఈనెల 4 నుంచి 10వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.మహేశ్వరరావు తెలిపారు. బుధవారం కాలేజీలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫెస్ట్‌లో జిల్లాలోని వివిధ పాలిటెక్నికల్ కాలేజీలకు చెందిన కంప్యూటర్స్, ఇసిఇ, ట్రిపుల్ ఇ, మెకానికల్, సివిల్ విభాగాల విద్యార్థులు సుమారు 8వేలమంది పాల్గొని, 180 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఫెస్ట్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎవరైనా సందర్శించవచ్చని కళాశాల కరస్పాండెంట్ ఎస్ వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ అమరేంద్ర కుమార్, హెచ్‌ఒడిలు సత్యవతి, రాజేంద్ర, స్వరూప, సోమేశ్, అరుణ, శ్రావణి పాల్గొన్నారు.